ప్రకృతికి అనుకూలంగా పునరుత్పాదితమైన
పేపరుతో ఈ పుస్తకం ముద్రించబడినది.

ఈ పుస్తకం కె.కె.బిర్లా ఫౌండేషన్ వారి ఆర్థికసహాయంతో తయారు చేయబడింది.
ISBN 81-237-1355-X

ప్రథమ ముద్రణ 1995 (శక 1917)

Pahalwan Ki Dholak *(Telugu)*

రూ. 5.50

డైరెక్టర్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, ఎ-5, గ్రీన్ పార్క్,
న్యూఢిల్లీ - 110016 ద్వారా ప్రచురింపబడినది.

నవశిక్షిత సాహిత్యమాల

పహిల్వాన్ గారి డోలు

ఫణీశ్వర్‌నాథ్ రేణు

అనువాదం

ఎ. విజయలక్ష్మి

చిత్రాలు

జగదీష్ జోషి

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా



లుట్టన్ సింగ్ పేరు తెలియని వాళ్ళులేరు. ఆ వూర్లో అందరికీ తెలుసు. "ఆల్ ఇండియాలోనే నాపేరు తెలియని వాళ్ళు ఉండరు." అని చెప్పుకుంటాడు. లుట్టన్ చెప్పే 'ఆల్ ఇండియా' మొత్తం చిన్న జిల్లా అంత ఉంటుంది.

లుట్టన్‌కి 9 సంవత్సరాలకే అమ్మ, నాన్న చనిపోయారు. అతని అదృష్టం బాగుండి అప్పటికే పెళ్ళయిపోయింది. లుట్టన్‌ని వాళ్ల అత్త చాలా ప్రేమగా పెంచింది. పెద్ద చేసింది. లుట్టన్ చిన్నప్పుడు ఆవులను మేపేవాడు. పాలు బాగా తాగి రోజూ కసరత్తు చేసేవాడు. అందుకని చిన్న వయస్సులోనే బాగా బలంగా ఉండేవాడు. రోజూ వ్యాయామం వల్ల శరీరం బాగా గట్టిపడింది. నా అంత బలమైనవాడు ఈ ఊళ్ళో ఎవ్వరూ లేరు. అనుకునేవాడు. అందరూ అతనిని చూసి భయపడాలని చేతుల్ని శరీరానికి ఎడం ఎడంగా పెట్టుకుని నడిచేవాడు. పెద్ద వస్తాదులాగా ప్రవర్తించేవాడు. అక్కడ సంతలో అప్పుడప్పుడు కుస్తీ పోటీలు జరిగేవి.

ఒకసారి లుట్టన్ శ్యాంనగర్ సంతలో జరిగే కుస్తీ పోటీలు చూడడానికి వెళ్ళాడు. కుస్తీ పోటీలు చూస్తూ ఊరికే తిరిగి రాలేకపోయాడు. వస్తాదులను చూస్తూంటే ఒంట్లో రక్తం వేడెక్కేంది. డోలు శబ్దానికి అతని ఒళ్ళు ఉప్పొంగింది. వస్తాదులు అందరిలోకి బలవంతుడు" పులిబిడ్డ" సవాలు విసిరాడు. పులిబిడ్డ అసలు పేరు 'చాంద్ సింగ్.' అతని గురువు బాదల్ సింగ్ తో పాటు వచ్చాడు. శ్యాంనగర్ కి రావడం ఇదే తొలిసారి. చాంద్ సింగ్ చాలా అందంగా బలంగా ఉన్నాడు. శరీరంలోని ప్రతి భాగం బలంగా ఉంది. కుస్తీ పోటీలు మొదలై మూడు రోజులయింది. ఈ మూడు రోజుల నుంచి అతను మిగిలిన వస్తాదులనందరినీ ఓడించేశాడు."పులిబిడ్డ" పేరుని నిలుపు కుంటున్నాడు. పోటీ మైదానంలో సింహంలా గర్జిస్తూ ఠీవిగా తిరుగుతున్నాడు.

శ్యాంనగర్ రాజు పెద్దవారై నారు. అందువలన చాంద్ సింగ్ ని తన కొలువులో నియమించుకొంటే బాగుంటుంది అనే ఆలోచన వచ్చింది. ఉన్నట్టుండి, చాంద్ సింగ్ తో పోటీకి నేను సిద్ధం అని లుట్టన్ సవాలు విసిరాడు. చాంద్ సింగ్ లుట్టన్ ని చూసి ఎగతాళిగా నవ్వాడు. తరువాత అతనిపై విరుచుకుపడ్డాడు.

పోటీ చూసే వాళ్ళలో కలవరం మొదలైంది. అరే



వీడికేమైనా"పిచ్చిపట్టిందా? ఛస్తావు, చచ్చాడు" అని అరుస్తున్నారు. కాని ఆశ్చర్యం! లుట్టన్ చాలా తెలివిగా చాంద్ సింగ్ పట్టునుంచి తప్పించుకున్నాడు. లేచి నిలబడి మళ్ళీ పోటీకి కాలు దువ్వాడు.

రాజుగారు పోటిని ఆపుచేశారు. లుట్టన్ ని దగ్గరకు పిలిచి అతని ధైర్యానికి మెచ్చుకున్నారు. పదిరూపాయలు తీసి లుట్టన్ చేతిలో పెట్టి "పోటీ చూసేసి వెళ్ళు అన్నారు..." కానీ లుట్టన్ వినిపించుకోకుండా రాజుని వేడుకుంటున్నాడు. "వద్దు ప్రభూ అలా అనొద్దు. పోటీ జరగడానికి అనుమతి ఇవ్వండి" అని బతిమాలాడు. "రాజుగారు ఏం నీకేమైనా పిచ్చాపో"...అన్నారు...

లుట్టన్ ని సిపాయిలు, మేనేజరు అందరూ కేకలేశారు. "శరీరంలో కొంచెం కూడా సత్తువలేదు. అయినా 'పులిబిడ్డ'తో పోటీ అంటున్నావు...రాజుగారు అందుకే వద్దంటున్నారు అర్ధం చేసుకో అన్నారు."

అయినా లుట్టన్ రెండు చేతులూ జోడించి రాజుని వేడుకున్నాడు. "మహారాజా! అనుమతి ఇవ్వండి. పోటీకి అనుమతి ఇవ్వకపోతే తల బాదుకుని ఇక్కడే చస్తాను." డోలు మోగడం ఆగిందంటే పట్టు వదిలి పోతుంది. అని వేడుకుంటున్నాడు. జనం చాలమంది వచ్చారు. మధ్యలో



కొంతమంది లుట్టన్ ని తిడుతున్నారు. కొంతమంది అతని పక్షం చేరారు. "అతన్ని పోటీకి వెళ్ళనివ్వండి." ఆపొద్దు అని పెద్దగా అరుస్తున్నారు.

అక్కడ మైదానంలో చాంద్ సింగ్ అతికష్టంగా నవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఎందుకంటే మొదటి పట్టులోనే లుట్టన్ శక్తి ఏమిటో తెలిసింది.

డోలు మోగుతోంది. చూసేవాళ్ళలో కోలాహలం ఎక్కువైంది. పులిబిడ్డతో పోటీ అని దుకాణాల వాళ్ళు మూసేశారు. పోటీ చూడడానికి పరుగు పరుగున వస్తున్నారు. రాజుగారు విసిగిపోయారు. చివరికి "పోటీ జరగడానికి " అనుమతిచ్చారు.

పెద్ద శబ్దంతో డోలు మోగుతోంది-"ఛట్-థ, గిడ్ థ, ఛట్-థ, గిడ్-థ అంటే పితా మహా రా ఢీకొను అంటుంది."

డోలు ముందే లుట్టన్ ని మెచ్చుకుంది. -"థక్-ధినా, థక్-ధినా, థక్-ధినా" అంటే ఓహో యువకా అంటుంది!!

చాంద్ సింగ్ లుట్టన్ గొంతు పట్టుకున్నాడు. గట్టిగా అదిమిపట్టి ఓడించడానికి ప్రయత్నిస్తున్నాడు. బాదల్ సింగు తన శిష్యుడిని ప్రోత్సహిస్తున్నాడు. అలాగే అలాగే అదిమిపెట్టు ఆహా...ఏం ...పట్టు ! అంటున్నాడు.

లుట్టన్ కళ్ళు తేలిపోతున్నాయి. ఊపిరి భారంగా వస్తుంది.

శ్వాస ఆగిపోయేటట్లు ఉంది. పక్క ఎముకలు ఫటఫట మంటున్నాయి. అందరూ చాంద్ సింగ్‌నే ఉత్సాహ పరుస్తున్నారు...లుట్టన్ పక్షాన ఎవ్వరూలేరు.

లుట్టన్ కేవలం డోలు మీదే ఆధారపడ్డాడు. తన ధ్యాస అంతా డోలు శబ్దం మీదే నిలిపాడు. అతనిలో ఆవేశం పెరిగింది. ఉన్నట్టుండి, డోలులో ఒక రకమైన చప్పుడు వినిపించింది."థక్-థిన్, తిరకట-థిన్, థక-థిన్, తిరకట-థిన్.డోలు ఏమనిందంటే ఒక మంచి పట్టుపట్టి తప్పించుకో అంది..."

చూసేవారందరూ ఆశ్చర్యపోయారు. లుట్టన్ చాంద్ సింగ్ పట్టులో నుంచి తప్పించుకున్నాడు. వేగంగా ముందుకు కదిలి చాంద్ సింగ్ గొంతు పట్టుకున్నాడు. ఇప్పుడు జనం అంతా లుట్టన్ వైపు తిరిగారు. అందరూ "లుట్టన్‌ని మెచ్చు కుంటున్నారు." ఆహా...మట్టిలో మాణిక్యం అంటున్నారు.

డోలు పెద్ద శబ్దంతో మోగుతోంది. ఛటక్-ఛట్ థ, ఛటక్-చట్ థ, అంటే లే ఇంకో పట్టు పట్టు అంటుంది.

లుట్టన్ ఉత్సాహంగా గబుక్కున పైకి లేచాడు. పట్టు మార్చి చాంద్ సింగ్‌ని వేగంగా నేలకేసి బాదాడు.

డోలులో శబ్దం మారింది. దాన్లోంచి ఇప్పుడు "ధిక్-

ధినా, ధికు-ధినా అని శబ్దం వస్తుంది." అంటే నువ్వు కోరుకున్నట్లు చెయ్యి. "ఓడించు అని." లుట్టన్ చాలా వేగంగా చాంద్ సింగ్‌ని ఓడించగలిగాడు.

డోలు లుట్టన్‌ని పొగుడుతోంది. -"ధగిడ్-గిడ్, ధగిడ్-గిడ్, ఆహా ఏం వీరుడు! ఏం వీరుడు!!" అంటుంది.

లుట్టన్ విజయాన్ని ప్రజలు రకరకాలుగా పొగుడుతున్నారు. అతన్ని ఆకాశానికెత్తేశారు. లుట్టన్ ఆనందంతో గంతులు వేశాడు. మొదట డోలు వాయించే వాని దగ్గరకు పరుగెత్తుకుని వెళ్లాడు. అతనికి దణ్ణం పెట్టాడు. మళ్ళీ పరుగున వెళ్ళి రాజుగారి ఒళ్ళో ఎగిరి కూర్చున్నాడు. రాజుగారి బట్టల నిండా మట్టి అంటింది!

మేనేజరు గారు లుట్టన్‌ని "అరే లేలే" అని కేకలేశారు. రాజుగారు నవ్వుకుంటూ లుట్టన్ వీపు తట్టి దీవించారు. "మన నేల పరువు నిలిపావు బాబూ", అని మెచ్చుకున్నారు!

పంజాబ్ పహిల్వాన్ లందరూ చాంద్ సింగ్ కళ్ళు తుడిచారు. లుట్టన్‌కి రాజుగారు బహుమతి ఇచ్చారు. తన కొలువులో నియమించారు. అప్పటి నుంచి లుట్టన్ ముఖ్య పహిల్వాన్ అయ్యాడు. రాజుగారు లుట్టన్‌ని "లుట్టన్ సింగ్"అని ఆప్యాయంగా పిలిచేవారు.

ఆస్థాన పండితులందరూ లుట్టన్ తక్కువ కులానికి



చెందినవాడు. "అయినా మీరు అతనిని సింగ్ అని పిలుస్తున్నారు." అని మూతి ముడుచుకున్నారు. రాజపూత్ అయిన మేనేజరు గారు కూడా "అవును ప్రభూ ఇది చాలా అన్యాయం" అన్నాడు. రాజుగారు చిరునవ్వుతో "అతను క్షత్రీయుల పని చేశాడు కదా!" అన్నాడు.

'లుట్టన్ సింగ్' పేరు చాలా దూర ప్రాంతాలకు పాకింది. రోజూ మంచి భోజనం, కసరత్తు, ముఖ్యంగా రాజుగారి ప్రేమ వల్ల చంద్రుడిలాగా వెలుగుతున్నాడు. అతి తక్కువ కాలంలోనే ఒక్కొక్కరుగా మిగిలిన పహిల్వాన్ లందరినీ ఓడించేశాడు.

కాలాఖాన్ అనే పహిల్వాన్ ఉండేవాడు. అతను లంగోటా బిగించి విరోధి పహిల్వాన్ లని పోటీకి పిలిచేవాడు. పోటీలో వారిని ఓడించి చంపుతాడు అనే పేరు ఉంది. అయితే లుట్టన్ 'కాలాఖాన్'ని కూడా ఓడించి ప్రజల అభిప్రాయాన్ని మార్చేశాడు. అప్పటినుంచి మిగిలిన పహిల్వాన్ లు ఎవ్వరూ లుట్టన్ తో పోటీకి వచ్చేవారు కాదు.

లుట్టన్ రాజ దర్బారుకు కాపలా పహిల్వాన్ గా ఉంటున్నాడు. అయితే అతని పరిస్థితి ఇప్పుడు పంజరంలో బంధించిన చిలుకలాగా ఉంది. పంజరంలో చిలక బయటకు రావడానికి ఎలా గిలగిలా కొట్టుకుంటుందో, అలాగే లుట్టన్

రాజుగారి ముందు తన బాధను చెప్పుకోవడానికి ప్రయత్నించేవాడు.

చాలా పొడవైన కోటు వేసుకొని సంతకు వెళతాడు. దుకాణాల వాళ్ళతో పరిహాసాలాడుతూ సంతలో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. మిఠాయి అంగడి వాడు పహిల్వాన్ గారూ ఇటు రండి. రసగుల్లా తాజాగా ఉంది. కొంచెం రుచి చూచి వెళ్ళండి. అని పిలిస్తే చాలు, పహిల్వాన్ చిన్న పిల్లాడిలాగా సంబరంగా నవ్వుకుంటూ వెళతాడు. వెళ్ళి రెండు సేర్లు రసగుల్లా పట్రా అంటాడు. తీరిగ్గా కూర్చుని రెండు సేర్లు రసగుల్లా తిని నోటినిండా కిళ్ళీ వేసుకుని బయట పడతాడు. కిళ్ళీ నములుతూ సంత అంతా తిరుగుతాడు. సంతనుండి తిరిగి దర్బారుకు వెళ్ళేసరికి అతని రూపం పూర్తిగా మారిపోయేది. తమాషాగా తయారవుతాడు. కళ్ళకు రంగు అద్దాలు పెట్టుకుంటాడు. చేతులనిండా బొమ్మలు పట్టుకుని, ఎర్రగా పండిన నోటితో నవ్వుకుంటూ, ఈల వేస్తూ తిరిగి వస్తాడు. పహిల్వాన్ ఆకారం అయితే పెద్దగా పెరిగింది. కానీ బుద్ధి మాత్రం మారలేదు. ఇంకా చిన్న పిల్లాడిలాగే ప్రవర్తిస్తుంటాడు.

మైదానంలో డోలు చప్పుడు అయితే చాలు, తన భారీ శరీరాన్ని ఈడ్చుకుంటూ పరిగెత్తుకుని వెళ్ళేవాడు. కానీ



అతని జోడీకి తగ్గవాళ్ళు ఎవ్వరూ ఉండే వాళ్ళు కాదు. ఎవరితోనైనా పోటీ చేస్తామన్నా రాజుగారు అనుమతి ఇచ్చేవారు కాదు. అందుకని లుట్టన్ నిరాశగా వెనక్కి వచ్చేవాడు. లంగోటా కట్టుకుని మైదానం అంతా దుమ్ము రేగేటట్లుగా పెద్ద ఆబోతులాగా రంకెలు వేసేవాడు. రాజుగారు అది చూసి చిన్నగా నవ్వుకునే వారు.

ఈవిధంగా 15 సంవత్సరాలు గడిచిపోయాయి. పహిల్వాన్‌ని ఎవ్వరూ ఓడించలేకపోయారు. లుట్టన్ అత్తగారు ముందే చనిపోయారు. అతని భార్య ఇద్దరు చిన్న పహిల్వాన్‌లని కని చనిపోయింది. ఇద్దరు పిల్లలు కూడా తండ్రిలాగా బలంగా ఉంటారు. ఇప్పుడు పహిల్వాన్ మైదానంలో ఎప్పుడూ తన ఇద్దరు కొడుకులతో కనిపిస్తున్నాడు. మైదానంలో వారిని చూసి అందరూ "ఆహా! తండ్రికి తగ్గ కొడుకులు" అనుకునేవారు.

ఇద్దరు కొడుకులు రాజ దర్బారులో కాబోయే పహిల్వాన్‌లుగా చలామణి అవుతున్నారు. వాళ్ళ పోషణ అంతా దర్బారు వారే చూసుకునేవారు. పహిల్వాన్ ప్రతి రోజూ పొద్దునే డోలు వాయిస్తూ పిల్లలిద్దరి చేత కసరత్తు చేయిస్తాడు. ఇద్దరినీ చెరోపక్క పడుకోబెట్టుకుని ప్రపంచ జ్ఞానాన్ని, కుస్తీ పోటీలో మెలకువలు నేర్పేవాడు. "డోలు



శబ్దం మీదే శ్రద్ధ ఉంచాలి. నాకు వేరే గురువు ఎవ్వరూ లేరు. డోలే నాగురువు. నేను ఎవ్వరి దగ్గిరా కుస్తీ నేర్చుకోలేదు. డోలు శబ్దంలో ఉండే మహిమ వల్లే నేను పహిల్వాన్‌ని అయ్యాను. పోటీకి మైదానంలోకి వెళ్ళిన వెంటనే మొదట డోలుకి నమస్కారం చేయాలి" అని వాళ్లకి చేప్పేవాడు. రాజుని ఎలా ప్రసన్నం చేసుకోవాలి. ఏ సమయంలో ఎలా ప్రవర్తించాలో కూడా నేర్పాడు.

కానీ అతను చేసిన ఉపదేశాలు నేర్పిన విద్యలు అన్నీ నీటిపాలయ్యాయి. ఎందుకంటే ఒకరోజు ముసలిరాజుగారు కన్ను మూశారు. మొత్తం రాజ్యాన్ని యువరాజు తన అధీనంలోకి తీసుకున్నారు. యువరాజు పెద్దరాజుగారి సమయంలో ఉన్న పనులలో కొన్ని మార్పులు చేశారు. కొన్నింటిని ఆపేశారు. వాటిలో కుస్తీ పోటీలు కూడా ఉన్నాయి. కుస్తీ పోటీల స్థానంలో ఇప్పుడు యువరాజుగారు గుర్రపు పందాలు నడిపేవాడు.

పహిల్వాన్‌కి, కాబోయే ఇద్దరు పహిల్వాన్‌లకి భోజనానికి ఎక్కువ ఖర్చు అవుతుండేది. ఇది యువరాజుకి, కొత్త మేనేజరు గారికి అనవసరమైన ఖర్చుగా అనిపించింది. అందుకని రాజ దర్బారులో ఇక పహిల్వాన్‌ల అవసరం ఏమాత్రం లేదని చెప్పారు. పహిల్వాన్ వెళ్లి



బతిమలాడుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు.

ఆ రోజే పహిల్వాన్ తన డోలు తీసుకుని ఇద్దరు పిల్లలతో తన వూరికి తిరిగి వచ్చేశాడు. అక్కడే ఉంటున్నాడు. ఆవూరి వారంతా కలిసి ఒక చిన్న గుడిసె వేసి ఇచ్చారు. వారి తిండి ఖర్చులు కూడా వూరివారి దగ్గర నుండే వస్తున్నాయి. చిన్న స్కూలు పెట్టి పిల్లల కందరికీ కుస్తీ పోటీలు నేర్పుతుండేవాడు. ప్రతిరోజూ పొద్దున సాయంత్రం తన శిష్యులతో పాటు ఇద్దరు కొడుకులకు కూడా కుస్తీ లో మెలకువలు నేర్పేవాడు.

గ్రామంలో అందరూ పేదవారు. కూలీ చేసుకుని బతికేవారు. అటువంటి వాళ్ల పిల్లలు ఏం తింటారు? కుస్తీ ఏం నేర్చుకుంటారు? చిన్నచిన్నగా పహిల్వాన్ బడి ఖాళీ అయింది. చివరకు తన ఇద్దరు కొడుకులు మాత్రమే మిగిలారు. డోలు వాయిస్తూ వారికే కుస్తీ నేర్పుతున్నాడు. ఇద్దరు కొడుకులు రోజంతా కష్టపడి ఎంతో కొంత సంపాదించేవారు. దానితోనే బతుకున్నారు.

అనుకోకుండా ఆ వూరికి కొండంత ఆపద వచ్చి పడింది. వర్షాలు పడలేదు. కరువు వచ్చింది. ప్రజలంతా ఆకలితో నక నకలాడుతున్నారు. అంతేకాక, కలరా, మలేరియా వంటి రోగాలు వచ్చాయి. అందరూ ఆకలితో

రోగాలతో చనిపోతున్నారు. గ్రామంలో ప్రతి రోజూ ఎన్నో శవాలను తగలపెడుతున్నారు. వూరంతా నిర్మానుష్యంగా అనిపిస్తుంది. ఒక్కొక్క ఇల్లు ఖాళీ అయిపోతుంది. ఎటువైపు చూసినా ఏడుపులు హా హా కారాలు. వూరివారంతా చలించి పోతున్నారు. ఒకరి నొకరు ఓదార్చుకుంటూ మంచి రోజులు రాకపోతాయా? అనే ఆశతో బతుకుతున్నారు. రాత్రి అయితే చాలు ప్రాణ భయంతో బిక్కు బిక్కుమంటున్నారు. అయితే చీకటి రాత్రిలో వాళ్లకి పహిల్వాన్ డోలు శబ్దం ధైర్యాన్ని ఇచ్చేది. పహిల్వాన్ సాయంత్రం నుంచి పొద్దున వరకు డోలు మీద ఒకే తాళాన్ని వాయించేవాడు."చట్ - థ, గిడ్ - థ, చట్ - థ, గిడ్ - థ అంటే 'లే పోరాడు' అని."

ఆకలితో భయంతో ఉన్న ప్రజలకు డోలు శబ్దం వింటే ప్రాణం లేచి వచ్చేది. కొత్త చైతన్యం వచ్చినట్లుండేది. ఆ శబ్దం సంజీవని లాగా పని చేసేది. కుస్తీ పోటీలు గుర్తు వచ్చేవి. అయినా డోలు శబ్దానికి జబ్బును ఆపగలిగే శక్తిలేదు కదా. కానీ డోలు శబ్దం వారికి చనిపోయే ముందు ఏవిధమైన కష్టం లేకుండా చావు అంటే భయం లేకుండా చేసేది.

పహిల్వాన్ ఇద్దరు కొడుకులు కూడా ఒకరోజు ఆ మహమ్మారి జబ్బు కోరల్లో చిక్కుకున్నారు. ఇద్దరు పహిల్వాన్లు జబ్బుతో బాధపడుతూ "నాన్నా 'లే పోరాడు'



అనే తాళాన్ని వాయించవా” అని అడిగారు.

పహిల్వాన్ రాత్రంతా డోలు వాయిస్తూనే ఉన్నాడు. “ఛటక్-ఛట్ థ, ఛటక్-ఛట్ థ.” మధ్యమధ్యలో ఉత్సాహ పరుస్తూ “వహ్ బహద్దూర్” అంటున్నాడు.

పొద్దున చూసేసరికి ఇద్దరు కొడుకులు నేలమీద పడి ఉన్నారు. ఇద్దరి కడుపులు లోపలికి అంటుకు పోయాయి. ఒకడు బాధతో మట్టిని నోట కరచి పట్టుకున్నాడు. అది చూసి పహిల్వాన్ బాధగా నిట్టూర్చాడు. కష్టపడి నవ్వడానికి ఎంతో ప్రయత్నిస్తూ ఇద్దరు పహిల్వాన్‌లు ఓడిపోయారు. అనుకున్నాడు.

పహిల్వాన్ రాజుగారు ఇచ్చిన పట్టు లంగోటా ఆ రోజు కట్టుకున్నాడు. శరీరం అంతా దుమ్ము నిండేటట్లు కసరత్తు చేశాడు. ఇద్దరు కొడుకులను చెరొక భుజాన వేసుకున్నాడు. నదికి తీసుకెళ్ళి అందులో పడేసి వచ్చాడు.

ఇది విన్న వారంతా ఆశ్చర్యపోయారు. పహిల్వాన్‌కి ఎంత గుండె నిబ్బరం అనుకున్నారు. ఇద్దరు కొడుకులు ఒకేసారి చనిపోతే ఎటువంటి వారికైనా ఏడుపు ఆగదు.

అటువంటి సమయంలో కూడా పహిల్వాన్ ఏడవలేదు. గాభరాపడలేదు. రాత్రి అయ్యేసరికి మళ్లీ డోలు శబ్దం వినిపించింది. ప్రజలకి ఎంతో ధైర్యం వచ్చింది. పిల్లల్ని



పోగొట్టుకొని ఏడుస్తున్న తల్లిదండ్రులు గుండెని చిక్కబట్టుకున్నారు. "ఇద్దరు కొడుకులూ చనిపోయారు. అయినా పహిల్వాన్ గుండె నిబ్బరం చూడండి" అనుకున్నారు.

నాలుగయిదు రోజులు గడిచాయి. ఒకరాత్రి డోలు శబ్దం వినిపించలేదు. పొద్దున్నే కొంతమంది శిష్యులు పహిల్వాన్ ఇంటికెళ్లి చూశారు. పహిల్వాన్ పూర్తిగా ఓడిపోయాడు. పోటీలో అతను ఎప్పుడూ ఓడిపోలేదు. కానీ మృత్యువు అతనిని ఓడించింది.

పహిల్వాన్ గారు ఎప్పుడూ, "నేను చనిపోయినా ఓడిపోయినట్టు కాదు. నేను జీవితంలో ఎప్పుడూ ఓడిపోలేదు. నా "చితి అంటించేటప్పుడు కూడా తప్పకుండా డోలు వాయించాలి అని చెప్పేవాడట." పహిల్వాన్ గారి శిష్యుడు ఒకతను ఏడుస్తూ ఈ విషయం అందరికీ చెప్పాడు.

పహిల్వాన్ చనిపోయి ఇప్పటికి 50 సంవత్సరాలయింది. కానీ ఇప్పటికి కూడా ఆ వూరి వారు అతనిని గుర్తు చేసుకుంటూ ఉంటారు. వాళ్లకి ఎప్పుడు ఏడుపు వచ్చినా, జబ్బుపడ్డా పహిల్వాన్ గారి డోలు చప్పుడు వినాలనిపిస్తుంది.

Printed at Jupiter Offset Works, Delhi-110032